సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 17 । మార్చి । 2025



సోమశిలలో 55.380 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 55.380 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 950 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.90,770
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,220
3శాతం జీఎస్టీతో	రూ.8,467
నవర (8గ్రా)	రూ.67,736

గరిష్ఠం/కనిష్ఠం 36.0 /25.6

వాతావరణం

సోమవారం జిల్లాలో వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ ఆదివారం 62 శాతంగా నమోదైంది.

ఇఫ్తార్	సహర్
సోమవారం	మంగళవారం
సా: 6.22	ఉ: 4.56

రంజాన్ వేళలు

అంబరాన్నంటిన రంగడి సంబరం



రథంలో కొలువుదీరిన స్వామి, అమ్మవారులు



నాలుగు కాళ్ల మండపం వద్ద ఎదురుకోలోత్సవం



రంగడి రథోత్సవం

- వైభవంగా రథోత్సవం
- తరలివచ్చిన అశేష భక్తజనం
- వేడుకగా ఎదురుకోలోత్సవం

నెల్లూరు(బృందావనం): నెల్లూరులో పవిత్ర పినాకినీ తీరాన రంగనాయకులపేటలో శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉభయదేవేరులతో సర్వాలంకార శోభితంగా తీర్చిదిద్దిన తిరుత్తేరు (రథం)పై కొలువైన రంగనాథుడిని దర్శించుకునేందుకు తరలివచ్చిన అశేష భక్తజనంతో మాడవీధులు పోటెత్తాయి. దాదాపు ఐదున్నర గంటలకు పైగా ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. తొలుత ఆలయంలో వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం స్వామి ఉభయ దేవేరులతో తూర్పు రాజగోపురం సమీపంలో ఉన్న రథమండపం వద్ద తిరుత్తేరులోకి వేంచేపు చేశారు. వివిధ పూజల తర్వాత మండం నుంచి రథం పినాకినీ తీరం వైపు ఉన్న ఉత్తర మాడవీధి వైపునకు అనంతరం తూర్పున ఉన్న గోపురం వీధి రైల్వేగేట్ వరకు అక్కడి నుంచి తిరిగి గోపురం వీధి, రంగనాయకులపేట, సంతపేట, నాలుగుకాళ్ల మండపం వరకు, అక్కడి నుంచి వెనుదిరిగి మండపం వరకు జరిగింది.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంప్రదాయంగా నాలుగు కాళ్ల మండపం వద్ద లక్ష్మీదేవి, చెంచులక్ష్మి సమేత వేదగిరి లక్ష్మీనృసింహస్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

పొట్టి శ్రీరాములు జీవితం అందరికీ ఆదర్శం

- మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు(బారకాసు): అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం అందరికీ ఆదర్శమని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. అమరజీవి జయంతి సందర్భంగా ఆదివారం నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాకాణి మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం అమరజీవి ప్రాణ త్యాగం వెలకట్ట లేనిదన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య, పార్టీ నేతలు అమరజీవి ఆశయ సాధనకు పునరంకితమవుతామని ప్రతిజ్ఞ చేస్తూ శ్రద్ధాంజలి ఘటించారు.

యువతుల పేరిట పరిచయాలు

- ఆపై ఫొటోలు, వీడియోలతో బూతు చిత్రాలు జతచేసి బెదిరింపులు
- ఓ యువతి ఫిర్యాదుతో నిందితుడి అరెస్ట్

నెల్లూరు (క్రైమ్): యువతుల పేరిట నకిలీ ఐడీలతో సోషల్ మీడియాల్లో పరిచయాలు చేసుకుని, తర్వాత యువతుల ఫొటోలను మార్ఫింగ్ చేసి డబ్బుల కోసం బెదిరిస్తున్న ఓ వ్యక్తిని చిన్నబజారు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు కోటమిట్టకు చెందిన ఓ యువతి ఓ ఆన్‌లైన్ వాణిజ్య సంస్థలో పని చేస్తోంది. ఆమె వివిధ యాప్స్‌ల్లో రీల్స్, మెసేజీలు పెడుతుండేది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌కు ఏడు నెలల కిందట నవ్య డాక్టర్ బేబి అనే ఐడీ నుంచి మెసేజ్ వచ్చింది. తనతో కలిసి పదో తరగతి చదువుకున్నానని మెసేజ్ చేయడంతో ఆ పేరుతో తన స్నేహితులు ఎవరూ లేరని ఆ ఐడీని బ్లాక్ చేసింది. రెండు నెలల తర్వాత ప్రియాంక అనే ఐడీ నుంచి మెసేజ్ వచ్చింది. ప్రియాంక ఐడీతో చాట్ చేయడం మొదలు పెట్టింది. కొద్ది రోజుల తర్వాత ప్రియాంక నుంచి ఆమెకు ఫోన్ వచ్చింది. మగ వ్యక్తి మాట్లాడడంతో తనతో ఇప్పటి వరకు చాట్ చేసింది మహిళ కాదని తేలడంతో అతన్ని నిలదీయగా, తన పేరు వెంకట జగన్, తనది సంజామల మండలం కర్నూలు జిల్లా అని చెప్పాడు. తనకు పోలీసు ఉన్నతాధికారులతో పరిచయాలు ఉన్నాయని, కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఆ యువతి ఫొటోలు, రీల్స్‌కు బూతు వీడియోలను జత చేసి యువతికి, యువతి స్నేహితురాలికి పంపారు. బాధిత యువతి అతనికి కాల్ చేయగా రూ.50 వేలు నగదు లేదా కమిట్‌మెంట్ ఇస్తే అలాంటి చర్యలకు స్వస్తి పలుకుతానని బెదిరించసాగాడు. బాధితురాలు ఈ నెల 14వ తేదీన చిన్నబజారు పోలీసులను ఆశ్రయించారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు నమోదు చేసి నిందితుడిని శనివారం అదుపులోకి తీసుకున్నారు.

నేటి నుంచి పది పరీక్షలు

- ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు
- అర్ధగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి
- హాజరు కానున్న 33,434 మంది విద్యార్థులు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 174 సెంటర్లు ఏర్పాటు చేశారు. 16,250 మంది బాలురు, 17,184 మంది బాలికలు కలిపి 33,434 మంది పరీక్షలు రాయనున్నారు. హాల్ టికెట్లను ప్రధానోపాధ్యాయుల లాగిన్ నుంచి విద్యార్థులకు అందజేశారు. ఇంకా ఎవరైనా తీసుకోకుండా ఉంటే ప్రభుత్వ వాట్సాప్ నంబర్ 95523 00009కు విద్యార్థుల వివరాలు పంపి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్ష జరగనుంది. విద్యార్థులను పరీక్ష సమయానికి అర్ధగంట ముందే కేంద్రం లోనికి అనుమతిస్తారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా 9 ఫ్లయింగ్ స్క్వాడ్, 24 సిట్టింగ్ స్క్వాడ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రం లోనికి స్మార్ట్ వాచ్‌లు, సెల్ ఫోన్లు, కాలుక్యూలేటర్లు అనుమతించరు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, వైద్యశాఖ నుంచి నర్సింగ్ సిబ్బందిని నియమించారు.

పదో తరగతి ఓపెన్ స్కూల్...

- 24 రెగ్యులర్ కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో పదో తరగతి ఓపెన్ స్కూల్ (ఏపీఓఎస్ఎస్) పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 28 వరకు జరగనున్నాయి. ఇందుకోసం విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పదో తరగతి పరీక్షలు రాసేందుకు 1,597 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఇందుకోసం ఎస్ఎస్‌సీ బోర్డు 24 రెగ్యులర్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఆత్మకూరులో 6, కావలి 3, కందుకూరు 4, కోవూరు 2, నెల్లూరు 4, వెంకటాచలం 2, ముత్తుకూరు 1, కలువాయి 1, సెంట్రల్ జైల్లో 1 పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. పరీక్షల నిర్వహణకు 96 మంది ఇన్విజిలేటర్లను, 21 సిట్టింగ్ స్క్వాడ్‌లను, 24 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను, మరో 24 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించారు.

ఇదేనా ప్రశాంతమ్మ పాలన?

- అధికార పార్టీ నేతల రెడ్‌బుక్ రాజ్యాంగం
- అక్రమాలు ఎత్తిచూపితే కేసులతో వేధింపులు
- వైఎస్సార్‌సీపీ నేత వీరి చలపతిరావు, అనుచరులపై కేసులు
- బూతు పురాణాలతో రెచ్చిపోతున్న పచ్చనేతలు



రాజకీయ చైతన్యానికి, విలువలకు కోవూరు నియోజకవర్గం మారు పేరు. ఇక్కడి నుంచి ఎన్నికై దేశ రాజకీయాల్లో ప్రాతినిధ్యం వహించిన గొప్ప రాజనీతిజ్ఞులున్నారు. దాదాపు ఏడు దశాబ్దాలుగా రాజకీయ విద్వేషాలకు, రాగద్వేషాలకు తావులేని గడ్డపై రెడ్‌బుక్ రాజ్యమేలుతోంది. జిల్లాలో చరిత్ర కలిగిన కుటుంబం నుంచి మహిళా నేతగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అనతి కాలంలోనే వర్గ రాజకీయాలు, కక్షలకు పురిగొల్పుతూ తెర వెనుక నుంచి ఆజ్యం పోస్తూ కొత్త సంప్రదాయానికి తెరతీస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

సాక్షి, టాస్క్‌ఫోర్స్: బసవారెడ్డి శంకయ్య నుంచి రేబాల దశరథరామిరెడ్డి, వెంకురెడ్డి, పెళ్లకూరు రామచంద్రారెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వంటి రాజకీయ ఉద్దండులు కోవూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. వర్గ రాజకీయాలకు దూరంగా పాలన సాగించి.. ప్రజాదరణ పొందారు. ఇటువంటి రాజకీయ చైతన్యంతోపాటు ప్రశాంత వాతావరణం ఉండే కోవూరులో వేమిరెడ్డి ప్రశాంతమ్మ పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం, రౌడీ రాజకీయాలు చోటు చేసుకుంటున్నాయి. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణిగా రాజకీయాల్లోకి వచ్చిన ప్రశాంతిరెడ్డి తన తొమ్మిది నెలల పాలనలో అశాంతి వాతావరణాన్ని ప్రేరేపిస్తున్నారనే విమర్శలు రాజకీయంగా దూమారం రేపుతున్నాయి.

రాజకీయ వేదికల్లో వినిపించే ప్రసంగాల్లో నీతిగా, వివాదాలకు దూరంగా ఉంటున్నట్లు కనిపిస్తున్న ప్రశాంతమ్మ తెర చాటు నుంచి మరో కోణంలో కనిపిస్తున్నారని రాజకీయ విమర్శలు వినిపిస్తున్నాయి. కొడవలూరు మండలంలో జరుగుతున్న ఉదంతాలు ఇందుకు అద్దం పడుతున్నాయి. ఇక్కడ జరిగిన ఘటనలను ఒకసారి పరిశీలిస్తే స్థానిక ఎమ్మెల్యే పాత్ర ఏ మేర ఉందో అవగతమవుతోంది.

ఎమ్మెల్యేకు తెలియకుండానే జరిగాయా?

- కొడవలూరు మండలం నార్తురాజుపాళెంలో జనవరి 20న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములను స్థానిక టీడీపీ నాయకుడు ఆక్రమించుకోవడాన్ని ఆధారాలతో సహా బయట పెట్టారు.
- ఇదే గ్రామానికి చెందిన మండల స్థాయి టీడీపీ నేత తన ఇంటినే పేకాట క్లబ్‌గా మార్చేసి యువతను పెడదోవ పట్టిస్తున్నారని వీరి చలపతి తెలిపారు. ఆ నాయకుడి పేకాట నిర్వహణ వీడియోలు సైతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని చూపించారు.
- ఇదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మద్యం షాపులు, ధాన్యం దళారుల వద్ద వసూళ్లకు పాల్పడుతుండడాన్ని వెలుగులోకి తెచ్చారు.

వీటిలో ఎంత మేరకు వాస్తవాలు ఉన్నాయనే విషయం ఎమ్మెల్యేగా విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన సంబంధిత లీడర్లపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి, టీడీపీ నేతల అక్రమాలు, అవినీతిని వెలుగులోకి తెచ్చిన చలపతిరావు, ఆయన అనుచరులపై వేధింపులు మొదలు పెట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే స్థానిక టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారనే ప్రచారం ఉంది.

పతాక స్థాయికి వేధింపులు

- రాజుపాళెం సమీపంలోని టపాతోపు రైల్వే గేటు వద్ద వరదలకు కూలిన గోడను సొంత నిధులతో పునర్నిర్మించేందుకు జేసీబీతో పనిచేయిస్తుండగా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నాడంటూ చలపతిరావుపై కేసు నమోదు చేయించి జేసీబీతో సహా సీజ్ చేయించారు.
- నార్తురాజుపాళెంలో చలపతిరావు వేసిన లేఅవుట్‌లో ప్లాటు కొనుగోలు చేసిన వ్యక్తి అందులో గ్రావెల్ నిల్వ చేసుకుని ఉండగా, అది చలపతిరావు అక్రమంగా తవ్వి నిల్వ చేశారని అక్రమ కేసు పెట్టించారు.
- ధాన్యం దళారుల వద్ద గతంలో చలపతిరావు వసూళ్లకు పాల్పడ్డాడని టీడీపీ నాయకులు ఆరోపించారు. దీనిపై ధాన్యం దళారులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తమ వద్ద చలపతిరావు ఎలాంటి వసూళ్లకు పాల్పడలేదని, టీడీపీ నాయకులే వసూళ్లకు పాల్పడ్డారని ఆధారాలతోసహా చెప్పారు. దీంతో అక్కసు పెంచుకున్న పచ్చ నేతలు ధాన్యం దళారిపై అక్రమంగా కేసు నమోదు చేయించారు.
- యల్లాయపాళెనికి చెందిన రౌడీషీటర్ అయిన టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు రాజేంద్ర సొంత చిన్నాన్న పొలానికే ఎసరు పెట్టి, వారిని ఇబ్బంది పెడుతున్నారని చలపతిరావు ఆధారాలతో విలేకరుల సమావేశంలో బయటపెట్టారు. దీంతో రెచ్చిపోయిన రాజేంద్ర విలేకరుల సమావేశంలో చలపతిరావుపై వినలేని రీతిలో వ్యక్తిగత దూషణలు, బూతు పురాణంతో చెలరేగిపోయారు.
- అత్యంత హేయమైన భాషలో రాజేంద్ర మాట్లాడడాన్ని చలపతిరావు అనుచరులు కొందరు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఖండించారు. రాజేంద్ర బూతు పురాణం, వ్యక్తిగత దూషణలను ఖండించిన చలపతిరావు అనుచరులైన ఐదుగురిపై పోలీసు కేసులు పెట్టించారు.
- బూతు పురాణంతో రెచ్చిపోయిన రాజేంద్రపై మాత్రం ఎలాంటి చర్యలు లేవు. ఎమ్మెల్యే ప్రోత్సాహం లేకుండా జిల్లా స్థాయి నేతపై వ్యక్తిగత దూషణలు చేయడం, ప్రశ్నిస్తే పోలీసు కేసులు పెట్టడం సాధ్యమేనా అనే చర్చ సర్వత్రా సాగుతోంది.

టీడీపీలో ఆధిపత్య జగడం

- స్థానిక నేతలకు, షాడో ఎమ్మెల్యేల మధ్య పొసగని సమన్వయం
- ఎమ్మెల్యే సమక్షంలో ఇద్దరు నేతల ముష్టిఘాతాలు

కోవూరు నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం ఏకంగా ఎమ్మెల్యే సమక్షంలోనే ఇటీవల ఇద్దరు నేతలు ముష్టి ఘాతాలకు దిగిన ఘటన రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సరికొత్త రాజకీయానికి తెరతీశారు. ఎన్నికల సమయంలో ఆయా మండలాల్లో ముఖ్య నేతలుగా చెలామణి అవుతున్న వారికి రూ.కోట్లు ఎరవేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికయ్యాక వీరిని పక్కన పడేసి తన కోటరీ, బంధువులైన స్థానికేతరులను మండలానికొక నేతను షాడో ఎమ్మెల్యేగా నియమించారు. ఈ క్రమంలో వీరికి స్థానిక నేతలకు మధ్య సమన్వయం పొసగడం లేదు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కోవూరు నియోజకవర్గంలో స్థానికేతర నేతలు మండలానికొకరు షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల సమయంలో రూ.కోట్లు తీసుకున్నారనే నెపంతో ఆయా మండలాల్లో స్థానిక నేతల పెత్తనానికి ఎమ్మెల్యే కత్తెర వేశారు. వీరి సిఫార్సులకు ఏ మాత్రం విలువ ఇవ్వడం లేదు. స్థానికేతరులైన షాడో ఎమ్మెల్యేలు ఇసుక, గ్రావెల్, రైస్ మాఫియా, చికెన్ వేస్ట్, కాంట్రాక్ట్ వర్కుల్లో పర్సంటేజీలు, పశువుల సంతలతో రూ.కోట్లు సంపాదించుకుంటున్నారు. అధికారం వస్తే పెత్తనమంతా మనదే అవుతుందని భావించిన స్థానిక నేతలు ఈ పరిణామాలను జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో ఆధిపత్యం కోసం నేతల మధ్య జగడాలు జరుగుతున్నాయి.

ఎమ్మెల్యే సమక్షంలోనే..

తాడేపల్లిలోని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నివాసంలో బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన సీనియర్ నేత అదే మండలానికి చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన చోటా నేతపై పితూరీలు చెబుతున్న సమయంలో నెల్లూరు నగరానికి చెందిన ఎమ్మెల్యే కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉండే కీలక నేత అడ్డు చెప్పారు. అధికారం వెంటే ఉండే నీవు ఆది నుంచి పార్టీని నమ్ముకుని ఉన్న నేతపై పితూరీలు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. వ్యక్తిగత దూషణలకు దిగడంతో నెల్లూరుకు చెందిన నేత బుచ్చిరెడ్డిపాళెం నేతపై ఒక దశలో చేయి చేసుకున్నాడనే ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే సమక్షంలోనే ఇద్దరు నేతల ముష్టిఘాతాలకు దిగడం సంచలనంగా మారింది. ఇద్దరికి సర్దిచెప్పిన ఎమ్మెల్యే బుచ్చిరెడ్డిపాళెం నేతపై మండి పడినట్లు తెలిసింది.

ఒక్కసారికే ఎమ్మెల్యే అంటూ..

బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన టీడీపీ సీనియర్ నేత ఇటీవల తన సన్నిహితుల వద్ద ప్రశాంతిరెడ్డి ఒక్కసారికే ఎమ్మెల్యే.. మరోసారి గెలిచే ప్రసక్తే లేదంటూ తరచూ అంతర్గతంగా డిబేట్లు పెడుతున్న విషయం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ నేపథ్యంలోనే ఆయనపై కొంత కాలంగా ఎమ్మెల్యే గుర్రుగా ఉన్నట్లు సమాచారం. తన ఇంట్లో తన సమక్షంలో జరిగిన ఘటన నేపథ్యంలో ఆమె ఈ విషయంపై కూడా తీవ్రస్థాయిలో ఘాటుగా స్పందించినట్లు సమాచారం. నాపైనే ఇతరుల వద్ద ఎలా ఇలాంటి చర్చలు పెడుతున్నావంటూ మండి పడ్డారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. తనకు జరిగిన పరాభవాన్ని జిల్లా స్థాయి కీలక నేతలతో పంచుకుని బాధపడినట్లు తెలుస్తోంది.

షాడో ఎమ్మెల్యేలదే పెత్తనం

స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నియోజకవర్గంలోని ఒక్కో మండలానికి స్థానికేతరులైన తన ముఖ్య అనుచరులను షాడో ఎమ్మెల్యేలుగా నియమించి, వారికే బాధ్యతలు అప్పగించారు. అన్ని వ్యవహారాలు వారే చెక్కబెడుతారని, వారు చెప్పినట్లే చేయాలని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సైతం వారి సూచనల మేరకే నడుచుకోవాలనే ఆదేశాలిచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో ఎమ్మెల్యేకు సమీప బంధువుతోపాటు మరి కొందరు నేతలు ఆమెచ్చిన ఆదేశాలతో రెచ్చిపోతున్నట్లు సమాచారం. ఇసుక అక్రమ రవాణా నుంచి, పశువుల సంత నిర్వహణ, కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు, గ్రావెల్ మాఫియా, రేషన్ దందా అన్నింట్లో కూడా తలదూర్చి బాగా వెనకేసుకుంటున్నారన్న ప్రచారం ఉంది.

ధాన్యం రైతులకు సకాలంలో అందని నగదు

నెల్లూరు (పొగతోట): ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ధాన్యం విక్రయించిన రైతులకు 24 నుంచి 48 గంటల్లోపు నగదు జమవుతుందని అధికారులు చెబుతున్నా.. వాస్తవ విరుద్ధంగా పరిస్థితులు ఉన్నాయి. కొడవలూరు మండలానికి చెందిన వీరి చలపతి అనే రైతు ఈ నెల 11న కొడవలూరులోని ఆర్‌ఎస్‌కేలో 505 బస్తాల ధాన్యం విక్రయించారు. 15వ తేదీ రాత్రి 8 గంటల వరకు అతనికి నగదు జమ కాలేదు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి రైతులు అనేక మంది ఉన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. నగదు సకాలంలో జమ కాకపోవడం, గోతాలు, రవాణా తదితర సమస్యలతో సతమతమవుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో తక్కువ ధరలకే ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు, దళారులకు రైతులు విక్రయిస్తున్నారు.

నగదు జమ చేస్తున్నాం

- అర్జున్‌రావు, సివిల్ సప్లయిస్ డీఎం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులకు సకాలంలో నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు 8,757 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. రూ.20.35 కోట్ల విలువ చేసే ధాన్యం సేకరించి రైతుల ఖాతాల్లో రూ.18 కోట్లు జమ చేశాం. మిగిలిన రైతులకు కూడా ఒకటి రెండు రోజుల్లో నగదు జమ చేస్తాం.

క్లుప్తంగా

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతుండగానో? లేక బహిర్భూమికెళ్లినప్పుడు ప్రమాదవశాత్తు జరిగిందో.. స్పష్టమైన కారణం తెలియదు గానీ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున నెల్లూరు వేదాయపాళెం రైల్వేస్టేషన్ సమీప నెల్లూరు వైపు వచ్చే పట్టాలపై చోటుచేసుకుంది. మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్ల లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా తయారైంది. నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

రోడ్డు దాటుతుండగా..

- కారు ఢీకొని మహిళ మృతి



రహమత్ (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం: ఓ మహిళ రోడ్డు దాటుతుండగా కారు వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఆదివారం బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. సంగం మండలం జెండాదిబ్బకు చెందిన షేక్ రహమత్ (55) బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని ముంబై జాతీయ రహదారిపై ఉన్న వే బ్రిడ్జి వద్ద రోడ్డు దాటుతోంది. నెల్లూరు వైపు అతివేగంగా వస్తున్న కారు ఆమెను ఢీకొట్టడంతో మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆగని చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా

- తాజాగా పడుగుపాడు వద్ద పట్టుకున్న పోలీసులు



పెన్నానదిలో వ్యర్థాలను పూడ్చి పెడుతున్న దృశ్యం

కోవూరు: కొందరు వ్యక్తులు చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున చెన్నై నుంచి జాతీయ రహదారి మీదుగా మినీ వ్యాన్‌లో వ్యర్థాలు వెళ్తున్న విషయాన్ని ఎఫ్‌డీఓ శ్రీనివాసులు కోవూరు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పోలీసులు పడుగుపాడు వద్ద వాహనాన్ని ఆపి పరిశీలించగా అందులో 17 చికెన్ వేస్ట్ డ్రమ్ములున్నాయి. వెంటనే డ్రైవర్ ఈగ నాగరాజు, క్లీనర్ దాసరి గణేష్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం వ్యర్థాలను సమీపంలోని పెన్నానదిలో పూడ్చిపెట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో ఎక్కడైనా చికెన్ వ్యర్థాలను రవాణా చేస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

పదోన్నతుల్లో అక్రమాలు?

ఏఎన్‌ఎంల ప్రమోషన్లలో తప్పుల తడకగా రోస్టర్

- రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం
- దివ్యాంగుల అవకాశాలకు గండి
- నేడు కౌన్సెలింగ్

నెల్లూరు(అర్బన్): సచివాలయాల్లో గ్రేడ్ – 3 ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న వారికి ఎంపీహెచ్‌డబ్ల్యూ – ఎఫ్ (గ్రేడ్ – 2) ఏఎన్‌ఎంలుగా ఇవ్వనున్న ప్రమోషన్లలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోస్టర్ పాయింట్లు సక్రమంగా నిర్వహించకపోవడం, దివ్యాంగుల కోటాలో ఇతర వర్గాలకు చెందిన వారికి ప్రమోషన్లు కల్పించేందుకు రంగం సిద్ధం చేసి జాబితాను విడుదల చేయడంతో గందరగోళం నెలకొంది. డీఎంహెచ్‌ఓగా కొత్తగా వచ్చిన వ్యక్తి కావడం, పాలనాపరంగా ఆమెకు ఇంకా పట్టు రాకపోవడంతో కింది స్థాయి సిబ్బంది చెప్పిందే శాసనం అన్నట్టు ఉంది. క్లర్కులు చెప్పిందే జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

289 మందికి..

వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే సచివాలయాల్లో ఏఎన్‌ఎం ఉద్యోగాలను కల్పించింది. అప్పుడు మెరిట్‌ను ఆధారంగా చేసుకుంది. ప్రస్తుతం 813 మంది సచివాలయ ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో అర్హతలను బట్టి 289 మందికి ఎంపీహెచ్‌డబ్ల్యూ – ఎఫ్ (మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ – ఫీమేల్)గా పదోన్నతులు కల్పించాల్సి ఉంది. వీటికి సంబంధించిన నోటిఫికేషన్ పెంచలయ్య డీఎంహెచ్‌ఓగా ఉన్నప్పుడు జరిగింది. రోస్టర్ తయారు చేశారు. సీనియార్టీ జాబితాను కూడా సిద్ధం చేశారు. ఆయన బదిలీపై వెళ్లారు. తర్వాత సుజాత బాధ్యతలు చేపట్టారు. అప్పటి జాబితాను ఇటీవల విడుదల చేశారు.

గందరగోళంగా..

వారం క్రితం ప్రమోషన్ల జాబితాను విడుదల చేసిన అధికారులు.. దీనికి సంబంధించి సోమవారం నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయానికి జరిగే కౌన్సెలింగ్ రావాలని సిబ్బందికి సూచించారు. అయితే సీనియార్టీ జాబితాను పరిశీలించుకున్న పలువురు అభ్యర్థులు తమకు అన్యాయం జరిగిందని ఆవేదన చెందుతున్నారు. జాబితాను గందరగోళంగా మార్చేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగుల కోటాను మింగేశారు

ప్రభుత్వ నిబంధనల మేరకు దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ ఉంది. అయితే 289 మంది ప్రమోషన్ల జాబితాలో కేవలం రెండు కేటగిరీలకు మాత్రమే అవకాశం కల్పించారు. మిగతా ఏడుగురి పోస్టులను జనరల్ కోటాకు బదిలీ చేశారు. ఇలా బదిలీ చేసేందుకు నిబంధనలు వర్తించవు. ఒకవేళ దివ్యాంగులు లేకపోతే ఆ పోస్టులను అలాగే ఖాళీగా ఉంచాలి. సుమారు ఆరునెలలపాటు సమయం తీసుకోవాలి. తర్వాత అందుకు సంబంధించిన కమిటీ సమావేశమై ఖాళీగా ఉన్న దివ్యాంగుల పోస్టులపై నిర్ణయం తీసుకోవాలి. కానీ ఇక్కడ అలా జరగలేదు. దివ్యాంగుల పోస్టులను ఇతరులకు కేటాయించడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు.

నగదు వసూలు చేసి..

పదోన్నతులు కల్పిస్తామని సచివాలయ ఏఎన్‌ఎంల నుంచి జిల్లా వైద్యశాఖ కార్యాలయంలోని ఒకరిద్దరు ఉద్యోగులు రూ.లక్షలు వసూలు చేశారని తెలిసింది. అనర్హులకు అర్హుల జాబితాలో చోటు కల్పించి అడ్డదారిన ప్రమోషన్లు కల్పించేందుకు రంగం సిద్ధం చేసినట్టు ప్రచారం జరుగుతోంది. కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని ఏఎన్‌ఎంలు కోరుతున్నారు.



నెల్లూరులోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం

రోస్టర్ మాయాజాలం

ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం రిజర్వేషన్లు ఉండాలి. వీరికి ఒక పద్ధతి ప్రకారం రోస్టర్ ఉంటుంది. రోస్టర్ కమ్ రిజర్వేషన్ పాటిస్తూ ప్రమోషన్ల సీనియార్టీ జాబితాను తయారు చేయాలి. అలాగే బీసీ, ఓసీ, దివ్యాంగులకు ఉంటుంది. ఉదాహరణకు 7వ నంబర్‌లో ఎస్సీకి చెందిన వ్యక్తి ఉండాలి. అలా లేకపోతే పోస్టును ఖాళీగా వదలాలి. కానీ ఇక్కడ ఇతర వర్గాలతో భర్తీ చేసేందుకు జాబితాను సిద్ధం చేశారు. దీంతో రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం జరిగిందని పలువురు పేర్కొంటున్నారు. వాకాడు గ్రామానికి చెందిన ఓ ఏఎన్‌ఎం ఆర్థోపెడిక్ హ్యాండీకాప్డ్‌గా ఉంది. అయితే ఆమెకు దివ్యాంగుల కోటాలో ప్రమోషన్ రాదని తెలుసుకుని కలెక్టర్ కార్యాలయానికి తపాలా ద్వారా ఫిర్యాదు చేశారు. దివ్యాంగుల కోటా అమలు చేస్తే తనకు ప్రమోషన్ వస్తుందంటూ తెలిపారు. అలాగే ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, మెడికల్ అండ్ హెల్త్ సైన్సెస్ రీజినల్ డైరెక్టర్, గుంటూరు, డీఎంహెచ్‌ఓ, నెల్లూరు వారికి ఫిర్యాదు చేశారు. మరికొందరు రోస్టర్‌లో లోపాల వల్ల తమకు నష్టం జరుగుతోంది కాబట్టి కౌన్సెలింగ్‌ను వాయిదా వేయాలని డీఎంహెచ్‌ఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. లోపాలు సరిచేసి ఈ ప్రక్రియను మళ్లీ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎవరికీ అన్యాయం జరగదు



ప్రమోషన్లకు సంబంధించిన నోటిఫికేషన్ నేను బాధ్యతలు చేపట్టకముందు విడుదలైంది. రోస్టర్‌ను తయారు చేసింది జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వారు. అందులో మా ప్రమేయం లేదు. దివ్యాంగులు లేకపోతే ఆ పోస్టులను జనరల్ అభ్యర్థులకు కేటాయించారేమో అనే విషయాన్ని పరిశీలిస్తాను. ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తాను. నష్టం జరుగుతుందనే వారు నేరుగా నాకు ఫిర్యాదు చేయాలి. పరిశీలిస్తాను.

– వి.సుజాత, డీఎంహెచ్‌ఓ

ఈత కొట్టేందుకు పెన్నా నదిలో దిగి..

- బాలుడి మృతి



బాలుడి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): స్నేహితులతో కలిసి పెన్నానదికి వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతై మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. తడికలబజారు ప్రాంతంలో శ్రీదేవి కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె పెద్ద కుమారుడు నందకిశోర్ తొమ్మిదో తరగతి, చిన్నకుమారుడు మహీధర్ (14) ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్లో ఏడో తరగతి చదువుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో మహీధర్ తన స్నేహితులైన కిరణ్‌కుమార్, రోహన్‌కుమార్, సాయి, చరణ్ తదితరులతో కలిసి పెన్నానదికి వెళ్లాడు. అందరూ కలిసి తిక్కన పార్కు సమీపంలో నదిలో చేపలు పట్టారు. తర్వాత ఈతకొట్టేందుకు నదిలో దిగే క్రమంలో మహీధర్ ప్రవాహంలో చిక్కుకుపోగా ఇంతలో అక్కడకు చేరుకున్న నందకిశోర్ రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. మహీధర్ నీటిలో గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు సంతపేట ఎస్సై బాలకృష్ణ ఘటనా స్థలానికి చేరుకున్నారు. కుమారుడు గల్లంతైన విషయం తెలుసుకున్న శ్రీదేవి తన భర్త వంశీ, బంధువులతో కలిసి పెన్నానదికి చేరుకున్నారు. అందరూ కలిసి బాలుడి కోసం గాలించారు. కొద్దిసేపటికి మహీధర్‌ను గుర్తించి బయటకు తీసుకొచ్చి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. బాధిత తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు



గాయపడిన కాశమ్మ

సీతారామపురం: స్థానిక కురవవీధికి చెందిన కాశమ్మ అనే మహిళపై ఆదివారం కోతులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికుల కథనం మేరకు.. మిద్దెపై దుస్తులు ఆరేసేందుకు కాశమ్మ వెళ్లడంతో ఒక్కసారిగా కోతులు దాడి చేశాయి. దీంతో ఆమె మిద్దె పైనుంచి కిందపడటంతో గాయపడింది. కుటుంబ సభ్యులు బాధితురాలిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

నిరుద్యోగులకు శిక్షణ

నెల్లూరు(పొగతోట): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్, సీడాప్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లుగా జేడీఎం హైమావతి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. టెలికాం, బ్రాడ్‌బ్యాండ్ టెక్నీషియన్, ఐటీ – ఐటీఈఎస్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్, ఎలక్ట్రానిక్స్, ఫీల్డ్ టెక్నీషియన్ తదితర వాటిపై శిక్షణ ఇస్తారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. 18 – 30 సంవత్సరాల వయసు ఉండాలన్నారు. శిక్షణ సమయంలో వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తి గల వారు 0861 – 2321261, 94900 80861, 89851 20012 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

తక్కువ ధరకు డీజిల్ ఇస్తానంటూ మోసం

- రైతుపై దాడి చేసి నగదు లాక్కెళ్లిన వైనం

మనుబోలు: 300 లీటర్ల డీజిల్‌ను తక్కువ ధరకు ఇస్తానని ఓ వ్యక్తి రైతును నమ్మించి రూ.24 వేలు తీసుకుని పరారయ్యాడు. ఈ ఘటన మనుబోలు మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. వివరాలు.. మోటార్‌బైక్‌పై వచ్చిన అపరిచితుడు గ్రామంలో ఓ రైతు వద్దకెళ్లి 300 లీటర్ల డీజిల్ ఉందని, సుమారు రూ.30 వేల విలువైన దానిని రూ.25 వేలకే ఇస్తానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన రైతు రూ.24 వేలతో అతని వెంట వెళ్లాడు. డీజిల్ యాచవరం హైవే వద్ద ఉందని చెప్పి రైతును బైక్‌పై ఎక్కించుకున్నాడు. దారిలో కుడి చెరువుకట్ట వద్ద అతను రైతుపై దాడి చేసి నగదు లాక్కొని చెరువులో తోసి పరారయ్యాడు. సదరు వ్యక్తి గతంలో ఇలాగే తక్కువ ధరకు డీజిల్ ఇస్తానని మోసగించేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది.

పోలీసుల అదుపులో నిందితులు?

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో కలకలం రేకెత్తించిన రౌడీషీటర్ సుజన్‌కృష్ణ అలియాస్ చింటూ హత్య కేసులో ఐదుగురు నిందితులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలుస్తోంది. వారిని విచారిస్తున్నట్లు సమాచారం. నిందితుల్లో కొందరితో చింటూ కు విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలోనే హత్య జరిగినట్లు సమాచారం. గతంలోనూ నిందితులు ఓసారి స్కెచ్ వేయగా చింటూ త్రుటిలో తప్పించుకున్నట్లు తెలిసింది. హత్య వెనుక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా?, ఇంకా ఎవరిదైనా ప్రమేయం ఉందా? అనే పూర్తి వివరాలు రాబట్టేందుకు వేదాయపాళెం పోలీసులు విభిన్న కోణాల్లో విచారిస్తున్నారు.

మా బతుకుదెరువు పోతుంది

- బీపీసీఎల్‌కు భూములివ్వం
- గుమ్మడిబొందల గ్రామస్తుల అల్టిమేటం



సీపీఎం నాయకులకు తమ గోడును తెలియజేస్తున్న రైతులు, గ్రామస్తులు

కావలి: బీపీసీఎల్‌కు భూమిలిచ్చేది లేదని గుమ్మడి బొందల గ్రామస్తులు తెగేసి చెప్పారు. సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు కావలి రూరల్ మండలం రుద్రకోట పంచాయతీలోని ఆ గ్రామంలో రైతులు, స్థానికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. బీపీసీఎల్ ఆయిల్ కంపెనీకి గ్రామంలోని పొలాలు పూర్తిగా అప్పగించాలని అధికారులు చేస్తున్న కుట్రలపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రామాయపట్నం పోర్టు అనుసంధానంగా ఏర్పాటు చేయబోతున్న ఆయిల్ కంపెనీకి పొలాలను అప్పగిస్తే, తమ బతుకుదెరువు ఏమైపోవాలని, ఎలా బతకాలని ప్రశ్నించారు. పొలాలు పోతే కల్లుగీత వృత్తి కనుమరుగైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పశువులు మేతకు తిరిగేదానికి కూడా అవకాశం లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం భూసేకరణను రద్దు చేసుకోవాలని, లేకపోతే పూర్తి స్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు తాళ్లూరు మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మారుపూడి రాధాకృష్ణయ్య, వలపర్ల వెంకయ్య, తుళ్లూరు వెంకయ్య, రామకృష్ణ, జమ్ముల శివశంకర్‌రావు, వెంకటస్వామి, ఉప్పాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.90
సన్నవి : రూ.60
పండ్లు : రూ.40

నెలరోజులు.. రూ.5 కోట్లు

డిజిటల్ అరెస్ట్ ద్వారా కాజేసిన సైబర్ నేరగాళ్లు

- రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- ఇటీవల మోసపోయిన విశ్రాంత ఉద్యోగి
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



➡ నెల్లూరు చైతన్యపురి కాలనీకి చెందిన విశ్రాంత ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ చేశారు. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 5వ తేదీ వరకు అతడి వద్ద నుంచి రూ.1.02 కోట్ల నగదును వివిధ బ్యాంక్ ఖాతాలకు జమ చేయించుకున్నారు. బెయిల్ కావాలంటే రూ.3 కోట్లు ఇవ్వాలని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

➡ జిల్లాకు చెందిన ఇద్దరు డాక్టర్లను సైతం ఇదే తరహాలో మోసగించారు. ఈ విషయంపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

➡ పొగతోటకు చెందిన ఓ మహిళకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆన్‌లైన్ ట్రేడింగ్‌పై లింక్ వచ్చింది. ఆమె దానిపై క్లిక్ చేయగా వాట్సాప్ నంబర్‌కు నిషాబాను అనే మహిళ మెసేజ్ పంపింది. ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో లాభాలు వచ్చేందుకు సలహాలు, సూచనలిస్తామని నమ్మబలికి తమ కంపెనీ యాప్‌ను మహిళ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయించి నగదు డిపాజిట్ చేయించింది. ట్రేడింగ్‌లో ఆదాయం వచ్చేలా చేసి ఆమెను నమ్మించింది. అనంతరం మహిళ చేత రూ.2.46 కోట్లు పెట్టించి మోసగించింది. బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నెల్లూరు(క్రైమ్): సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. నయామోసాలతో క్షణాల్లో జనాలను దోచేస్తున్నారు. ఇళ్లలో దొంగతనాలు.. దారిదోపిడీల కన్నా ప్రస్తుతం సైబర్ నేరాలే అందరిని హడలెత్తిస్తున్నాయి. ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న కొందరు ఇతర ఆదాయాల కోసం ఆన్‌లైన్‌లో అన్వేషిస్తున్నారు. ఇది గమనించిన సైబర్ నేరగాళ్లు వలవేసి రూ.లక్షలు కొట్టేస్తున్నారు. చదువుకున్నవారే ఎక్కువగా మోసపోతున్నారు. నెలరోజుల వ్యవధిలో జిల్లాకు చెందిన డాక్టర్లు, ఆడిటర్లు, విశ్రాంత ఉద్యోగి తదితరుల నుంచి రూ.5 కోట్ల వరకు సైబర్ నేరగాళ్లు దోచేశారు. ఏడాదికేడాది మోసాలు పెరుగుతూ ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

సీబీఐ పేరుతో..

ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు కొత్తపంథాలో నేరాలకు పాల్పడుతున్నారు. డిజిటల్ అరెస్టులు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. సైబర్ నేరాల్లో ప్రస్తుతం ఈ తరహా మోసాలే అధికంగా జరుగుతున్నాయి. సీబీఐ, ఈడీ, నార్కోటిక్స్ అధికారుల పేరిట సమాజంలో సంపన్నవర్గాలు, విద్యావంతులు, ఉద్యోగులు, వైద్యులు, పిల్లలకు దూరంగా ఉంటున్న తల్లిదండ్రులకు ఫోన్ చేసి నమ్మేలా ప్రవర్తిస్తారు. అనంతరం విదేశాల నుంచి వచ్చిన కొరియర్‌లో డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలు ఉన్నాయని, మీపేరుపై అరెస్ట్ వారెంట్ జారీ అయ్యిందంటూ నకిలీ పత్రాలను వాట్సాప్‌లో పంపుతున్నారు. విచారణ పూర్తయ్యే వరకూ ఇంట్లో నుంచి కదలనివ్వకుండా నిర్బంధిస్తున్నారు. వివరాలు సేకరిస్తున్నట్లు నటిస్తూ కేసు నుంచి బయటపడాలంటే తాము చెప్పినంత మొత్తాన్ని చెల్లించాలని లేదంటే అరెస్ట్ తప్పదని కంగారుపెట్టి వారు అడిగినంత ఖాతాలో జమయ్యాక వదిలేస్తున్నారు. మనీ ల్యాండరింగ్ చేస్తున్నారంటూ మరికొందర్ని బెదిరించి డబ్బులు కాజేస్తున్నారు. ట్రేడ్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని, వర్క్ ఫ్రం హోమ్ పేరిట నమ్మించి ఇంకొందరిని మోసగిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మోసగాళ్లు చెప్పేవి నిజమని భావించొద్దు. అసలు డిజిటల్ అరెస్టులు లేవు. నిజంగా ఏదైనా కేసు ఉంటే సంబంధిత పోలీస్ అధికారి నేరుగా వచ్చి మాట్లాడతారు. దేశంలో ఏ దర్యాప్తు సంస్థ కూడా వీడియోకాల్లో విచారణ చేయదు. అలా చేస్తే వారు సైబర్ నేరగాళ్లని అర్థం చేసుకోవాలి. మోసపూరిత ఫోన్ కాల్ వస్తే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930 లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి. తక్షణ ఫిర్యాదుతో బాధితులు కోల్పోయిన డబ్బులు తిరిగి పొందే అవకాశాలుంటాయని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు.

డిజిటల్ అరెస్ట్‌లు ఉండవు



సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పోలీస్ అధికారులు వీడియోకాల్ చేసి కేసుల విచారణ చేయరు. అలా చేశారంటే మోసం చేస్తున్నారని గుర్తించాలి. డిజిటల్ అరెస్ట్‌లేవు. సైబర్ మోసాలపై జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎవరైనా మోసాలకు గురైతే 1930, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయండి.

– జి.కృష్ణకాంత్, ఎస్పీ